

# చావు-బ్రతుకు

**-జి.సత్యం**

మృత్యువుకు తర తమ భేదం లేనట్టే దాని ప్రభావానికీ లేదు.. అందుకే ఆ భయం, ఆ విషాదం, ఆ స్మశాన వైరాగ్యం! అయితే, మృత్యువు జీవితం మీద ఆసక్తిని చంపదు. జీవితాన్ని మరింత ఆసక్తికరమైనదిగా చేస్తుంది. అదే తమాషా!

## మా చిన్ని కొడుకు సురేష్ నీటిలో పడి అకస్మాత్తుగా మరణించాడంటే హడావుడిగా అక్కడికి వెళ్లాను.

సురేష్ శవం చుట్టూ చేరి ఏడుస్తున్నారు అంతా....

"సురేష్ అమ్మా నాన్నలు, సురేష్ అక్క ఏడుస్తున్నారంటే ఓ అర్థం వుంది. చూడవచ్చిన ప్రతిఒక్కరూ కళ్ళ నీళ్లు పెట్టుకుని కుమిలిపోవడం ఏమిటి?" అలా ఏడుస్తున్న వారిని చూసి అసహ్యమేసింది నాకు.

"వీరంతా నిజంగా దుఃఖం ముంచుకొచ్చి ఏడుస్తున్నారా?" ఎందుకో వారిదంతా నటన అనిపిస్తుంది నాకు.

శవం పక్కన సురేష్ అత్తమ్మ కాబోలు కంట్లో నీళ్ళు రాకుండానే- దీర్ఘాలు పెడుతోంది. ఆ దీర్ఘాలకు సురేష్ అమ్మా నాన్నలు మరింత శోకమూర్తులయిపోతున్నారు. కొంతమంది పరామర్శించే నెపంతో...చనిపోయిన సురేష్ గుణగణాలను గోరంతలు కొండంతలు చేసి వర్ణిస్తూ .. వారి ఆవేదనను పెంచేస్తున్నారు.

"వీరంతా చనిపోకముందు సురేష్‌ను ఒక్కసారైనా మెచ్చుకున్నారా?" నాకు అనుమానమేసింది.

'చనిపోయినవారంతా మంచి వారయినప్పుడు మరి బ్రతికున్న మనుషు లందర్నీ మంచివారుగా ఎందుకు గుర్తించరూ?'

సురేష్ చనిపోయాడంటే- దుఃఖం ముంచుకొచ్చి కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోలేదు నేను. మామూలుగానే వున్నాను. నా చుట్టూ వున్నవారు మాత్రం ఏడుస్తున్నారు, రోదిస్తున్నారు. వారి కోసం ఏడుద్దామన్నా... కళ్ళల్లో నీళ్ళు రావడం లేదు.

"రేయ్ సురేష్ లెయ్యరా....?" శవంగా మారిన సురేష్‌ని కుదిపేస్తోంది వాళ్ళక్క.

ఆ అమ్మాయి చదువుకొంది. అంతో ఇంతో లోక జ్ఞానం కూడా వుంది. అయినా తన కళ్ళ ముందు తిరగాడిన తమ్ముడు చనిపోయాడన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతోంది.

చనిపోయినవారు తిరిగి బ్రతకరనీ తెలుసు. మాటాడరనీ తెలుసు. అయినా ఏదో ఆశ!

ఆ ఆశతోనే తమ్ముణ్ణి పలకరిస్తోంది.

పలకరించడమే కాదు. శవాన్ని పట్టి కుదిపేస్తోంది.

ఆ అమ్మాయిని పట్టుకుని ఓదార్చాను.

"మా ఇంటికి రా అన్నయ్యా!అంటే-నీ పెళ్లికి వస్తానని చెప్పి ఇంతలోనే ఎందుకొచ్చావన్నయ్యా...?" నన్ను పట్టుకొని భోరున విలపించిందా అమ్మాయి.

ఆ అమ్మాయి రోదనకు నా మనస్సు చివుక్కుమంది.

వారం రోజుల క్రితం కాబోలు ఆ అమ్మాయి మా ఇంటికి వచ్చింది "ఇంటికి రా అన్నయ్యా!" బ్రతిమిలాడింది.

మా ఇంటికీ, వారింటికీ మధ్య దూరం 'అర' కిలోమీటరుంటుంది. అక్కడికి వెళ్లడానికి, ఆ అమ్మాయి పెళ్లికీ పొంతన పెట్టాను నేను.

"శుభకార్యానికీ, అశుభకార్యానికీ తప్ప మరెప్పుడూ బాంధవ్యాలూ, బంధుత్వాలూ గుర్తుండవా అన్నయ్యా!" అన్నట్లుంది ఇప్పటి ఆ అమ్మాయి రోదన.

ఆ అమ్మాయి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలంటే యాంత్రిక ప్రపంచంలో బ్రతికే మనిషి, బాంధవ్యాలూ బంధుత్వాలతో ముడిపడి వున్న అసలయిన మనిషి జీవితంలోకి తొంగిచూడాలి. అలా తొంగిచూడడానికి అవకాశం ఇవ్వకుండానే ఆకాశ హర్మ్యాలు నిర్మించుకుని అంతరిక్షంలోకి పయనిస్తున్నాడు మానవుడు.

'సృష్టికి ప్రతిసృష్టి చేస్తూ 'దేవుడు లేడు...'' అని నిరూపించే మానవుడు. ఈ అకస్మాత్ మరణాలను ఆపెయ్యగలుగుతున్నాడా? .... మరణానికి మూలమయిన కారణాలను తెలుసుకొంటున్నాడా...? లేదు. గోరంతను కొండంతలు చేసి ఉత్తుత్తి కబుర్లు చెప్తూ తాను సంపాయించుకొన్న విజ్ఞానాన్ని భూతద్దంలో చూపిస్తూ ... తను సంపాయించుకోవలసిన కొండంత పరిజ్ఞానాన్ని మాత్రం చిన్న అద్దంలో చూపి మురిసి పోతున్నాడు', ఒక్కసారి నా మనస్సు ఆధ్యాత్మికంలోకి తొంగి చూసింది.

ముఖ్యమయిన బంధువు లెవరో రావాలని సురేష్ శవాన్ని అలాగే వుంచేశారు.

'మనతో కలిసి మెలిసి తిరిగిన వ్యక్తి మన నుంచి నిష్క్రమించాడంటేనే - ఆ నిజాన్ని జీర్ణించుకోవడానికి చాలా కాలం పడుతుంది. అలాంటిది నవ మాసాలు మోసి కని పెంచిన బాబు చేతికందే సమయంలో చేజారి పోయాడంటే తనతో పంచుకొన్న అనుబంధాన్ని తెంపుకొని పారిపోయాడంటే -ఆ వాస్తవాన్ని భరించడానికి ఎంతో కాలం పడుతుంది.' అదే పరిస్థితి సురేష్ అమ్మా నాన్నలది.

వారిని చూస్తే జాలేస్తోంది. అయితే అంత కన్నా ఎక్కువగా వారిని ఓదార్చాలన్న ప్రయత్నంలో ... నేను పడుతున్న అవస్థకు అలసట తోడయి నాలో ఆకలి అవురావురుమంటోంది.

బిడ్డను కోల్పోయి ఓ పక్క ఆ ఇంట్లో వారు ఏడుస్తుంటే నా ఆకలి తీరే మార్గం కోసం అన్వేషించాను.

చిన్న పనుందని చెప్పి హోటల్‌కి వెళ్ళి కూర్చున్నాను.

ప్లేటులో పదార్థాలు వేడి వేడిగా నాలో ఆకలిని పెంచేస్తున్నాయి. ఓసారి సురేష్ నిర్జీవ ముఖం నా కళ్ళ ముందు ప్రత్యక్షమయ్యింది.

సురేష్‌ని కోల్పోయిన తల్లి దండ్రుల మనః పరిస్థితి నాలో ఆకలిని అప్పటికప్పుడే చంపేసింది.

ఏమీ తినకుండానే - బిల్లు చెల్లించి వచ్చేశాను.

"ఎంత ఏడ్చినా పోయిన బిడ్డ తిరిగొస్తాడా...?"

ఎవరో పెద్దాయన సురేష్ అమ్మా నాన్నలను సముదాయిస్తున్నాడు.

"ఏడ్వటానికయినా కన్నీళ్ళుండాలి! ఈ టీ నీళ్ళు తాగండి..." ఓ పెద్దావిడ బలవంతంగా టీ నీళ్ళు తాగించటానికి ప్రయత్నిస్తోంది.

వారి ప్రయత్నం ఫలించలేదు.

తెలిసిన వారు కనిపించగానే బావురుమంటున్నారు వారు.

"విచార గ్రస్తమైన వారి ముఖంలో విషాద రేఖలు రూపు మాపటం ఒక్కకాలానికి మాత్రమే సాధ్యం!" అది తెలుసుకొనే కాబోలు పెద్దావిడ లోనికెళ్ళింది.

గొంతు ఎండి పోతుంటే - నీళ్ళు తాగుదామని నేనూ లోనికి వెళ్ళాను.

నన్ను చూడగానే ఆవిడ కంగారు పడింది.

ఆమె తాగుతున్న 'టీ' తొణికి క్రింద పడింది

నాకు మంచి నీళ్ళు కూడా తాగబుద్ధి కాలేదు. వెనక్కి తిరిగాను.

సాయంకాలం అయిదు గంటలయినా రావలసిన వారు రాలేదు.

"పీనుగను ఇంకా ఇంట్లో ఎంతసేపని వుంచుకుంటాం? కావలసిన పని కానిస్తే సరిపోతుంది" ఎవరో పెద్దాయన పదే పదే అంటున్నాడు. నాకు ఆ మనిషి మీద భలే కోపం వచ్చింది. సురేష్‌ని...పీనుగంటాడా? 'నువ్వే పీనుగవి' అందామనిపించింది కానీ అనలేక పోయాను. "కావలసిన వారు రాకముందే, కావలసిన పని కానిచ్చేస్తారా? ఇంట్లో పీనుగనుంచుకోడమేమిటి? ఇంత వరకు యీ ఇంట్లో తిరిగిన వాడేగా!" నాలో అంత దుఃఖం, అంత కోపం వుందని నాకే తెలియదు!

"నేనూ మనిషినే. అమానుషంగానో, చాదస్తంగానో అనడం లేదు. ఉదయం నుంచి శవాన్ని ఇంట్లో వుంచుకుని ఏడుస్తూ కూచున్నారు. వచ్చి పోయే వాళ్ళు ఆ ఏడుపుల్ని మరింత పెంచేస్తున్నారు. "ఇంట్లో పిల్లా జెల్లా వాళ్ళ సంగతేమిటి? పోయిన వాళ్ళతో పోలేము. మిగిలిన వాళ్ళ సంగతేమిటి?" అన్నాడు ఆయన నాకు నచ్చ చెబుతున్నట్టు. ఆయన మాటలు ఇప్పటికీ నాకు నచ్చలేదు.

ఆశ్చర్యం కలిగేట్టుగా ఆయన చెప్పినట్లే జరుగుతోంది. అందరూ ఆయన మాటల్లో వున్న వాస్తవాన్ని అంగీకరిస్తున్నట్టు కనబడడంతో నాకు చిరాకేసింది. నా చిరాకుతో సంబంధం లేకుండానే, ఒక్కొక్కటే శవ దహనం వరకూ ఏడుపుల మధ్య, నిర్లిప్తత మధ్య జరిగిపోయాయి.

ఆ తర్వాత ఇంటికెళ్ళిపోయాను. బాలింత అయిన నా భార్య ఆ విషాద సన్నివేశాన్ని చూడ్డం మంచిది కాదని ఆమెను తీసుకు వెళ్ళలేదు. కానీ, నేను అక్కడి పరిస్థితిని వర్ణించి చెబుతున్నప్పుడు ఆమె కూడా ఏడ్చింది. చావును దగ్గరగా చూసినప్పుడు, నిర్లిప్తంగా, స్తబ్దంగా వున్న నేనూ అప్పుడు బాగా దుఃఖించాను. పరస్పరం ఓదార్చుకున్నాం. నిజంగా సురేష్ చనిపోయినందుకే మేమిద్దరమూ ఇంతగా దుఃఖించి, ఇలా ఒకర్నొకరం ఓదార్చుకున్నామా? తెలీదు.

ఆ తర్వాత అన్నం తినమంటే వద్దన్నాను. నా భార్య బలవంతం చేసి తినిపించింది. "ఈ పూట అన్నం మానేసినా మరో పూట తినాలిసిందేగా, పోయిన వాళ్ళతో మనమూ పోతామా?" అంది. నేను అన్నం తిన్నాను. దుఃఖం కొంచెం అడుగున పడినట్లనిపించింది. ఆలోచన పైకొచ్చింది. "పోయిన వాళ్ళతో పోతామా?" ఆ పెద్దమనిషి అన్నదీ ఇదే. ఏడుస్తున్న వాళ్ళను 'టీ' త్రాగమని ఆ పెద్దావిడ వత్తిడి చేసిందీ, తను రహస్యంగా పుచ్చుకున్నదీ ఇందుకే! పోయిన వాళ్ళతో పోలేము. అవును...చావులో నుంచే మొలుచుకొచ్చే బ్రతుకు! చావూ, బ్రతుకూ!

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్